



ఉమ

# మరచిపోలేను చరిత్రా

అది నూతన దంపతుల జీవితంలో మొదటి రాత్రి అని గుమ్మానికి కట్టిన పచ్చని తోరణాలు, గదిలో పందిరి మంచానికి వ్రేలాడుతున్న మల్లె దండలు చెబుతున్నాయి. కిటికీలకు కట్టిన జలతారు తెరలు ఫ్యాన్ గాలికి ఒయ్యారంగా లేచి పడుతూ, టేబిల్ మీద ఫ్లవర్ వాజ్‌లో అందంగా అమర్చిన గులాబి పువ్వుల ప్రక్కనే ఉన్న అగరుబత్తులు దివిటీల్లా కాలిపోతూ సువాసన వెదజల్లుతున్నాయి. గదిలో పచార్లు చేస్తూ సిగరెట్టు కాలుస్తున్న అజయ్‌కి ఇదంతా చూస్తూ ఉంటే చిరాకుగా ఉంది.

గుమ్మం దగ్గర కిలకిల మన్న అలికిడికి ఉలిక్కిపడి తల తిప్పి చూశాడు అజయ్. లోనికి ప్రవేశించింది చరిత్ర. గది తలుపులు అప్రయత్నంగా మూసుకున్నాయి.

వేలు రూపాయలు ఖరీదు చేసే పట్టు చీర చరిత్ర ఒంటిమీద ధగధగా మెరిసిపోతున్నది. తలంటి పోసుకున్న వెంట్రుకల్లో తెల్లని మల్లె పువ్వులు స్వచ్ఛంగా నవ్వుతున్నాయి. బుగ్గమీద చుక్క, నుదుటి మీద నెలవంక, మెడలో నల్లపూసలు, పసుపుతాడు—పవిత్రంగా కనుపించింది ఆమె రూపం.

కిలకిలమన్న అలికిడి, అడుగుల చప్పుడు అంతర్ధానం అయ్యాయి. అజయ్ చూపులకు తట్టుకోలేనట్లు అడుగు ముందుకు వేయలేక తల వంచుకుని బరువుగా నిలబడింది చరిత్ర. హఠాత్తుగా చుట్టూ ఆవరించిన నిశ్శబ్దంలో ఏదో పిరికితనం చరిత్రను వెనక్కు లాగినట్లైంది. గుండెలో ఎన్నో అనుమానాలు చెలరేగుతుంటే బలవంతంగా తల పైకెత్తి అజయ్ కళ్ళలోకి దీర్ఘంగా చూసింది. పంచకట్టులో నిండుగా, ఆకర్షణీయంగా కనిపించాడు అజయ్. చరిత్రకు గతం గుర్తుకు వచ్చింది.

ప్రక్కనే జలపాతపు హోరు, హోరుమని ఎత్తైన కొండల మీది నుండి క్రిందికి దూకుతూ బండరాళ్ళ మీద పగిలిన గాజు ముక్కల్లా చెల్లాచెదురైపోతున్న నీటి ధార, వాన జల్లులా ఒంటి మీదకు వచ్చి పడుతున్న చన్నీళ్ళ స్పర్శ, చలిగాలిలో భయంగా

పొంగిపోతున్న పడుచుదనం — ఇంతలో అతను రావడం, గాఢంగా కౌగిలిలో బిగువుకోవడం, తన సర్వం అందుకోవడం ...

తియ్యని తలపులతో చరిత్ర ఒడలు పులకరించింది.

సిగరెట్టు పొగలు పొగలుగా వదులుతున్న అజయ్ కూడా గతంలో మరుగు పడిపోయిన సంఘటనలు గుర్తు చేసుకుంటున్నాడు. అతని ఒడలు జలదరించ సాగింది. సిగరెట్టు చేతికేసి కొట్టి, తలవెంట్రుకలు పీక్కున్నాడు అజయ్.

"బావా ..." అతని మనసులో జరుగుతున్న సంఘర్షణ ఏమిటో అర్థం చేసుకున్న చరిత్ర బాధ పడుతూ పిలిచింది.

"నే నేమై పోతున్నానో అర్థం కావడం లేదు. ఎంత మరిచిపోదామన్నా మరిచిపోలేకుండా ఉన్నాను. అబ్బ! మరిచిపోలేను, చరిత్రా. మరిచిపోలేను." బాధగా అరిచాడు అజయ్.

"ను...నువ్వు జరిగినదంతా ఎన్నటికి మరిచి పోలేవని నాకు తెలుసు! అందుకే, బావా! ఈ ... ఈ వివాహం వద్దని ప్రతివాదాలు కున్నాను. కానీ ఒప్పు కున్నావు కావు! నా గర్భంలో పెరుగుతున్న బిడ్డ ... బిడ్డ కోసం ..." అంటూ మరి మాట్లాడలేక చేతుల్లో ముఖం దాచుకుంది చరిత్ర!

"నే నెంత స్వార్థపరుణ్ణో, చరిత్రా! అసలు ... అసలు ఇలా జరిగి ఉండకూడదు. నువ్వు ... మనోహర్‌నే వివాహం చేసుకుని ఉంటే ఎంత బాగుండేది?"

అతని మాటలు పూర్తి కాకుండానే చరిత్ర "ఇప్పు డదంతా ఎందుకు బావా?" అనేసింది.

చరిత్ర మనోహర్‌ని వివాహం చేసుకుంటుందని విన్నప్పుడు మానసిక క్షోభతో ఎంతగా అల్లాడి పోయాడు! తన ప్రాణ స్నేహితుడు తనను మోసం చేశాడని కోపంతో రెచ్చిపోయి పశువులా ప్రవర్తించాడు. ఇప్పుడు చరిత్ర అగ్నిసాక్షిగా తనదై పోయింది. ఈ మూడు ముళ్ళూ పడక ముందే ఆమె గర్భంలో మరో ప్రాణి పెరుగుతున్నదని అతనికి నిశ్చయంగా తెలుసు. అన్నీ తను అనుకున్న విధంగానే జరిగాయి!

కానీ...!!

ఎంతటి శిక్షను విధించాడు భగవంతుడు? తనకు తగిన శాస్తి జరిగింది కదా? కానీ జరిగినదంతా మరిచిపోలేకుండా ఉన్నాడే! తను విద్యావంతుడు. సంస్కారవంతుడు. కానీ మనోహర్ తన గురించి అనుకున్నదంతా నిజమేనే! మనోహర్ అంత ఎత్తులో తను ... ఈ క్రింది మెట్టు మీద ప్రాకు లాడుతున్నాడని తనకు తెలుసు! అయినా తనలో జరుగుతున్న సంఘర్షణ ఏమిటి?

చరిత్ర మనోహర్‌ని వివాహం చేసుకుని ఉంటే నిజంగా సుఖపడేదా? మనోహర్ తనలా ఈ మానసిక చిత్రవధ అనుభవించేవాడు కాదా?

• • •

వాళ్ళు చిన్ననాటి స్నేహితులు. ఒకే బడిలో, తరవాత కొంత కాలం కాలేజీలో కలిసి చదివారు. తరవాత వాళ్ళ చదువులు వేరైనా, మనోహర్ హాస్టల్లో ఉంటూ ఎప్పుడూ అజయ్ ఇంటికి వస్తూ పోతూ, ఉండేవాడు.

చరిత్ర అజయ్ మేనత్త కూతురు. చరిత్ర పుట్టగానే ఇంట్లో అందరూ ఏకగ్రీవంగా చేసుకున్న నిర్ణయం చరిత్రను అజయ్ కిచ్చి వివాహం చేయాలని. బావ, మరదలు ఈడూ జోడూ సరిపోయి కలిసి మెలిసి తిరుగుతూ పెద్దల నిర్ణయం సమ్మతించారు. ఇదంతా మనోహర్‌కి చిన్నప్పటి నుండీ తెలుసు.

అజయ్ మెడికల్ కాలేజీలో చేరి చదువు పూర్తి చేసి హౌస్ సర్జన్‌గా పని చేసే వేళకు మనోహర్ ఎమ్. ఏ. లిటరేచర్ పూర్తి చేసి యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరాడు. చరిత్ర బి. ఎ లో యూనివర్సిటీకి వెళ్ళడం మొదలు పెట్టింది. అలా అనుకోకుండా చరిత్ర మనోహర్ శిష్యురాలయింది.

మనోహర్ పేరుకు తగ్గట్టుగా మనోహరంగా ఉండేవాడు. అతని రూపం, నడత, స్వభావం, సంభాషణ—అన్నీ అజయ్ కన్న భిన్నగా ఉండేవి. చరిత్ర మనోహర్‌తో సన్నిహితంగా మెలుగుతున్నదని ఇంట్లో అందరూ, అందరితోపాటు అజయ్ గ్రహించినా స్నేహితుడి మీద పూర్తి నమ్మకం ఉండడం చేత వాళ్ళ స్నేహానికి అక్షేపణ చెప్పలేదు.

అజయ్‌కి హౌస్సర్జన్సీ పూర్తి చేసిన తరవాత ఎమ్. డి. లో సీటు వచ్చింది. వాళ్ళ పెళ్ళి తొందరలో జరిపించాలని పెద్దలుకూడా ఆరాట పడుతున్నారు. ఎన్నడూ చరిత్రతో హద్దు మీరి ప్రవర్తించని అజయ్‌కూ చరిత్రను త్వరలో వివాహ మాడి దాంపత్య జీవితం సాగించాలని ఉన్నది. ఇటువంటి పరిస్థితుల్లో తెలివిగా వాళ్ళ పెళ్ళికి అడ్డు పుల్ల వేసింది చరిత్ర.


"బావా! నా కింకా చదువు కోవాలని ఉంది. నీ ఎమ్. డి. పూర్తి అయ్యేంతవరకూ మన వివాహం వాయిదా వేయాలని నా ప్రార్థన" అన్నది చరిత్ర.

చరిత్ర మాట ఎప్పుడూ కాదనలేదు అజయ్ సరే నన్నాడు. అలా మరో సంవత్సరం గడిచింది.

కానీ ఇంతలో పిడుగు లాంటి వార్త అతని చెవిన పడి అతని ప్రపంచం తల్లకిందులయింది. చరిత్రకు మనోహర్‌ను వివాహం చేసుకోవాలని ఉన్నదని అత్తయ్య తన తల్లి తండ్రులతో చెబుతుంటే చాటు మాటున విని తన చెవులు తాను నమ్మలేక పోయాడు. అజయ్ గుండెలో అగ్ని పర్వతం బద్దలైనట్లయింది. పగలు సెగలై అతనిని చుట్టు ముట్టాయి. ఆ సెగలలో నల్లగా కాలిపోయి అతని హృదయం నలుపు రంగుకు తిరిగింది.

"రాస్కెల్! ప్రాణ స్నేహితు డని నమ్మినందుకు నన్నే మోసం చేసి చరిత్రను తన వశం చేసుకుంటాడా? వీళ్ళు ఇద్దరూ కలిసి ఇంత నాటకం ఆడినందుకు మోసానికి మోసం చేసి దెబ్బకు దెబ్బ తీస్తాను. ఏది ఏమైనా సరే చరిత్ర నాదే కావాలి." అని తీర్మానం చేసుకుని మృగంలా ఆలోచనలు చేయసాగాడు అజయ్.

ఒక ఆడది తనది కావాలనుకుంటే పురుషుడు ఆమె మీద శారీరకంగా దాడి అయినా చేయాలి. లేదా బలవంతంగా ఆమె మెడలో తాళి అయినా కట్టాలి. ఈ రెండిటిలో ఏది జరిగినా అప్రయత్నంగా స్త్రీ ఆ పురుషుడికి అంకితం అయిపోతుంది. ఈ వలలోంచి బయట పడే సాహసం, ధైర్యం ఈ భారతదేశంలో పుట్టిన స్త్రీకి ఉండదు. ఉండడానికి వీలు లేదని కథల్లో వ్రాస్తున్నారు. సినిమాల్లో చూపిస్తున్నారు. ఒకవేళ స్త్రీ సాహసించినా స్వీకరించే ఔదార్యం మగవాడికి అసలు ఉండదు. స్త్రీకి శీలం ఎంతో ముఖ్యం. అది పోగొట్టుకున్న స్త్రీ అపవిత్రమై పోయినట్లే లెక్క. అటువంటి స్త్రీని మగవాడు గౌరవించ లేడు. మనః పూర్వకంగా స్వీకరించ లేడు. చరిత్ర కేవలం ఈ భారత దేశంలో పుట్టిన అబల—ఒంటరిగా ఎక్కడకైనా తీసుకు వెళ్ళి ఆమెను బలవంతంగాలొంగ తీసుకుంటే ఏం చేయగలదు? తనను తిరస్కరించి మనోహర్‌ను పెళ్ళాడే ధైర్యం చరిత్రకు ఉండదనుకున్నాడు అజయ్.



మానవుని మానసిక ప్రవృత్తి—అందులో భారత స్త్రీ ఎంతటి సబలో అర్థం చేసుకున్నా ననుకున్న అజయ్ ఒక చిత్రమైన పన్నాగం పన్నాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఒకనాడు మనోహర్ తన స్వగ్రామం వెళ్ళుతూ అజయ్‌ను చూడడానికి వచ్చాడు.

"నేను సెలవు మీద స్వగ్రామం వెళ్ళుతున్నాను వారం రోజులకు తిరిగి వస్తాను" అంటూ చెప్పాడు మనోహర్.

అనుకూల సమయం చిక్కిందని నిర్ణయించి అజయ్ యుక్తిగా తను పన్నిన పన్నాగం ఆచరణలో పెట్టాడు.

"అరే! ఈ శని, ఆదివారాలు శివసముద్రం వాటర్‌ఫాల్సు మన ముగ్గురం కలిసి సరదాగా వెళ్ళి రావచ్చుననుకున్నానే!" అని అన్నాడు అజయ్.

"అలాగా? చరిత్ర ఒప్పుకుంటే అలాగే వెళ్ళి రావచ్చు. మీ రిద్దరూ ముందుగా వెళ్ళండి. నేను శనివారం రాత్రికి తప్పకుండా మిమ్మల్ని చేరు కుంటాను!" అమాయకంగా అన్నాడు మనోహర్.

"వెరీ గుడ్! మనసుల్లో కసిగా ఉన్నా స్నేహ పూర్వకంగా నవ్వుతూ మాటలు కలిపాడు అజయ్.

ఆ శనివారం శివసముద్రం వెళ్ళడం అంతగా ఇష్టం లేకపోయినా, మనోహర్‌కూడా వస్తున్నాడని. బావతో ఎన్నో విషయాలు మాట్లాడుకుందామని చరిత్ర అజయ్ వెంట బయలు దేరింది. దారి పొడుగునా కారులో ఎన్నోమార్లు అజయ్‌తో మాటలు కలపాలని ప్రయత్నించింది. కానీ అతను ఏదీ వినిపించుకునే పరిస్థితిలో లేకపోయాడు.

నాలుగు గంటలకంతా శివసముద్రం చేరుకున్నారు. జలపాతం హోరు దూరం నుండే వినవచ్చింది. బాగా వర్షాలు పడి జలపాతం తీవ్ర రూపం దాల్చి ఉందని, బండరాళ్ళు దాటుకుని జలపాతం సమీపించడం అపాయకరమని అక్కడివారు చెప్పారు.

టి. బి. లో రెండు గదులు ఏర్పాటు చేసుకుని జలపాతం చూడడానికి బయలు దేరారు. చరిత్ర వద్దని వారిస్తున్నా వినకుండా ఆమెను బలవంతం చేసిమెల్లిగా బండరాళ్ళు ఎక్కుతూ, దిగుతూ జలపాతం చేరుకున్నారు.

చుట్టూ పరికించి చూచాడు అజయ్! ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా ఉంది. చరిత్ర కేక వేసినా ఎవ్వరికీ వినపించనంతటి శబ్దం చెవులను చిల్లులు పొడుస్తున్నది.

చరిత్ర కళ్ళల్లోకి పిచ్చిగా చూచాడు అజయ్.

"ఏమిటి, బావా! అలా చూస్తున్నావ్?" అమాయకంగా అడిగింది చరిత్ర.

పువ్వులా ఉన్నచరిత్రను చూస్తూ ఉంటేఆ క్షణం మృగం కాలేకపోయాడు అజయ్. సభ్యత, సంస్కారం నేర్పిన విద్య అడ్డు వచ్చినట్లైంది. అతనిలో ఏదో అసహాయత, తెలియని బలహీనత ఆవరించి నట్లైంది. ఏమీ చేయలేక వెర్రివాడిలా బండ రాళ్ళ మీది నుండి ఇటూ అటూ దూకడం మొదలు పెట్టాడు.

"బావా! ఏమిటా ఆవేశం? బండరాళ్ళు పాచిగా ఉన్నాయి. కాలు జారేను, జాగ్రత్త!" అని చరిత్ర అన్నదో లేదో అంతే జరిగింది. అజయ్ కాలు జారి



జానపద నృత్యం
జి. చంద్రశేఖర రెడ్డి

బండరాళ్ళ మీది నుండి క్రిందకు జారి పోయాడు. అతను మనిషిగా క్రిందకు జారి పోయిన క్షణం కూడా అదేనేమో!

"బావా!" భయంగా పై బండ మీది నుండి కేక వేసి తన చేయి అందించబోయింది చరిత్ర. కానీ అతన్ని ఏ విధంగానూ అందుకోలేక పోయింది.

"బా—బావా! . . .ఏ. . . ఏం చేయను?" చరిత్ర కళ్ళ నీళ్ళు దిగమింగుకుంటూ, జీరపోతున్న గొంతుకతో పై నుంచి అరిచింది.

"ఏదైనా. . .తాడులాంటిది ఉంటే అందించు" అన్నాడు అజయ్.

చరిత్ర వెంటనే చీర కుచ్చెళ్ళు వదులు చేసి చీర విప్పి ఒక వైపు భాగం పై బండకు కట్టి మరో వైపు క్రిందకు విసిరింది. కుంభ వృష్టిలా జలపాతం అజయ్ మీదకు వచ్చి పడడం, చరిత్ర విసిరిన చీర అజయ్ అందుకోవడం, నీటి ఒత్తిడికి అతని కాళ్ళు పైకి తేలిపోవడం, చరిత్ర గావుకేక పెట్టడం—అన్నీ ఒకే క్షణం జరిగాయి!

కొన్ని నిముషాల అనంతరం పూర్తిగా తడిసి పోయి ఆయాసపడుతూ పైకి చేరుకున్నాడు అజయ్.

"బావా!" అంటూ ఏడుస్తూ అమాంతం అజయ్‌ని పెనవేసుకు పోయింది చరిత్ర.

ఆ క్షణం సర్వం మరిచిపోయారు ఇద్దరూ.

"చరిత్రా! చరిత్రా!. . ." అంటూ అతనూ, "బావా! బావా!. . ." అంటూ ఆమె ఒకరిలో ఒకరు గాఢంగా లీనం అయిపోయారు.

అలిసిపోయిన అజయ్‌కి చరిత్ర కౌగిలిలో నిద్ర పట్టింది. కాసేపటికి కళ్ళు తెరిచి చూచాడు. బాగా చీకటి పడింది. చరిత్ర అతని పక్కన కనుపించలేదు. ఉలిక్కిపడి లేచి ఇంకా తడితడిగా ఉన్న బట్టలు తొడుక్కుని టి. బి. కి పరుగెత్తాడు.

వరండాలో నిలబడి మెయిన్ రోడ్డు వైపు పరాకుగా చూస్తున్నది చరిత్ర. చరిత్ర మనోహర్ రాకకై ఎదురు చూస్తున్నదని క్షణంలో అర్థమైంది అజయ్‌కి. ఇంత జరిగిన తరవాత కూడా చరిత్ర ఇంకా మనోహర్ కొరకు ఎదురుచూడడం అసభ్య మనిపించి ఓర్వలేక "చరిత్రా!" అని గట్టిగా పిలిచాడు. అతను అక్కడ ఉన్నదే గ్రహించని చరిత్ర ఉలిక్కిపడి అజయ్ కేసి చూసింది. చరిత్ర కళ్ళు ఎర్రగా, తడితడిగా ఉన్నాయి. ఆమె కళ్ళలోకి దీర్ఘంగా, మత్తుగా చూచాడు అజయ్.

"చరిత్రా! నిన్ను, నిన్ను ఈ క్షణమే గుడిలో శాశ్వతంగా నా అర్ధాంగిని చేసుకుంటాను!" అని ఆవేశంగా అరిచాడు అజయ్.

"బా... బావా! దయచేసి అక్కడ జరిగిన దంతా మరిచిపో!" అంటూ అజయ్ ఎదుట నుండి వెళ్ళబోయింది చరిత్ర. ఆమె చేయి హఠాత్తుగా అందుకుని ఆమెను దగ్గరగా లాక్కోబోయాడు అజయ్.

"ప్లీజ్, బావా! ... ఆవేశపడకు!" అంటూ మెల్లగా వారించింది చరిత్ర.

"నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను. చిన్నప్పటి నుండీ నువ్వు, నువ్వు నా కాబోయే భార్య వనుకున్నాను! నువ్వు నా దానివి, చరిత్రా!" అంటూ ఏమిటేమిటో పిచ్చిగా మాట్లాడాడు అజయ్.

"అ... అదంతా నాకు తెలుసు... కానీ ... కానీ నిన్ను నేను వివాహం చేసుకోలేను, బావా!" అంటూ అతని చేయి విడిపించుకుని గదిలోకి పరుగెత్తుకు పోయింది చరిత్ర.

చరిత్ర మాటలకు అజయ్ నెత్తిమీద పిడుగు పడినట్లైంది!

తన సర్వం అర్పించుకున్న తరవాత కూడా తనతో ఇలా మాట్లాడుతున్న దేమిటీ భారత స్త్రీ? అంటే చరిత్ర ఇంకా మనోహర్‌నే ప్రేమిస్తున్నదా? అయితే... వా రిరువురి మధ్య జరిగింది కేవలం శారీరక వాంఛ మాత్రమేనా? అంటే చరిత్రకు తాను నిజంగా ఏమీ కాడా? తనకు తీరని అన్యాయం జరుగుతున్నట్లు అనిపించింది.

ఆమెను బలవంతం చేసి తనతో పెళ్ళికి ఒప్పించాలనే ఉద్దేశంతో గదిలోకి అడుగు పెట్టాడు అజయ్. చరిత్ర పక్కమీద బోర్లా పడుకుని తల గడలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

చరిత్ర ఏడుస్తుంటే అజయ్ కడుపులో కెలికి నట్లైంది. ఆమె ప్రక్కనే కూర్చుని; ఆమె తల నిమురుతూ వేడార్చాడు!

"చరిత్రా! నేను ... నిజంగా చాలా దుర్మార్గుణ్ణి. నిన్ను మోసం చేశాను. నన్ను క్షమించు" అంటూ పశ్చాత్తాపంతో పరితపించసాగాడు.

"బా...వా?" అతని మాటలు చరిత్రకు బొత్తిగా అర్థం కాలేదు.

"అవును, చరిత్రా! నేను చాలా చెడ్డవాణ్ణి. సంస్కారం లేని మృగాన్ని! నిన్ను... నిన్ను లోబరుచుకున్నాను."

"బావా, దయచేసి అలా మాట్లాడకు! నేను ... నేను ... నిన్ను ఎంత గాఢంగా ప్రేమిస్తున్నానో నీ కెలా చెప్పను!" అంటూ చరిత్ర పక్కమీద నించి లేచి కూర[illegible]

"చరి[illegible]! [illegible]

మనోహర్‌ను ప్రేమించడం లేదా?" ఆశ్చర్యంగా అడిగాడు అజయ్.

"బావా! నిన్ను తప్ప ఈ జన్మలో నేను మరెవ్వరినీ ప్రేమించలేనని కొన్ని గంటల క్రితమే నాకు అర్థం అయింది" అన్నది చరిత్ర.

"అ... అంటే మరి అత్తయ్య నీకు మనోహర్‌ని చేసుకోవాలని ఉన్నదని —" అజయ్ మాటలు పూర్తి కాలేదు.

"నేను అమ్మతో అన్న మాటలు నిజమే, బావా! అమ్మ నా నిర్ణయం విని ఎంతగా ఏడ్చిందో చెప్ప లేను — అప్పుడు నేను అమ్మతో అన్న మాటకు అర్థం లేదు, బావా" అన్నది చరిత్ర.

"నీ మాటలు బొత్తిగా అర్థం కావడం లేదు, చరిత్రా. ఇదంతా నీకు పరిహాసంగా ఉందా? నన్ను ఎందు కిలా చిత్రవధ చేస్తున్నావ్?" బాధగా, అయోమయంగా అరిచాడు అజయ్.

"బావా! నీతో ఎలా చెప్పను? ఏమని చెప్పను? బావా? జరిగిందంతా నీతో చెప్పుకోలేక, నీతో చెప్పకుండా నిన్ను మోసం చేయలేక నాలో నేను ఎంత చిత్రవధ అనుభవించానో నీ కెలా తెలుస్తుంది? బావా? మనోహర్‌కు జరిగిందంతా తెలుసు. ఇంత జరిగినా అతను నన్ను గౌరవిస్తున్నాడు. అతడు నన్ను ఎప్పటికి గౌరవిస్తాడని నాకు తెలుసు. అందుకే, బావా, అతనినే వివాహం చేసుకోవాలని, నీకు దూరం అయిపోవాలని నిర్ణయించుకున్నాను." చరిత్ర మాటలు పూర్తి కాలేదు.

"అసలేం జరిగింది, చరిత్రా. దయచేసి చెప్పు" అంటూ చరిత్ర భుజాలు పట్టి గట్టిగా—ఆవేశంగా ఊపాడు అజయ్.

"శీలం పోగొట్టుకున్న ఆడదానిని నువ్వు గౌరవించగలవా, బావా?"

"చరిత్రా?"

"నీ దృష్టిలో. . . ఈ సంఘం దృష్టిలో నేను పతితను, బావా."

"చరిత్రా!" గట్టిగా అరిచాడు అజయ్.

"అవును, బావా? రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఘోరసత్యం ఒకటి నా గుండెలోనే దాచుకోవాలనుకున్నాను. కానీ ప్రకృతి వీలు పడనీయలేదు. ఇందులో తప్పు నాదికూడా ఉంది. నన్ను మీ రంతా క్షమించ లేరు. కానీ, బావా! ఏం చేయను? కొన్ని క్షణాలు చేయి దాటి పోయినాక అనుకుని లాభం ఏముంది?

మేమంతా ఒక ఆదివారం నందీ హిల్సుకు పిక్‌నిక్ వెళ్ళాం. మాలో కొంతమంది అనుభవం కోసం కొన్ని మత్తుమందులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాము. ఇది మిమ్మల్ని ఎంత దూరం తీసుకు వెళ్ళుతుందనే ప్రస్తావనే లేకపోయింది. నీతా. . . జరిగిందంతా ఎలా చెప్పను, బావా" చరిత్ర మాటలు పూర్తి కాలేదు.


"చరిత్రా!" ఒళ్ళంతాచెమటలు పట్టిన అజయ్ మరోసారి వెర్రిగా అరిచాడు.

"నా...నా కన్నెతనం ఆ నాడే పోయింది, బావా. న...నన్ను అనుభవించింది ఒక్కడు కాదు . . . ముగ్గురు, బావా. ఒళ్ళు తెలియని పరిస్థితిలో నేను—వాళ్ళు—మరి కొందరు సిగ్గుతో, అవమానంతో ఇళ్ళకు తిరిగి వచ్చాము" అన్నది చరిత్ర.

అజయ్ మెదడు బండ బారినట్లైంది అతని కళ్ళకు జరిగిం దంతా సినిమా రీలులా కనుపించి అతని తల మీద ఎవరో సుత్తి పెట్టి కొట్టినట్లైంది.

"తనది, తనది అనుకుంటూ పవిత్రంగా పదిల పరుచుకున్న చరిత్ర కన్నెతనం. . . ఒక్కడు కాదు ఇద్దరు ఇద్దరు, కాదు ముగ్గురు దోచు... కున్నారు. ఇది బలాత్కారంకూడా కాదు."

అజయ్ హృదయం ముక్కలు ముక్కలుగా విరిగి పోయింది. చరిత్ర ఇంకా చెప్పుకు పోయింది. "ఇది జరిగిన రెండు నెలలకు నేను గర్భవతి నయ్యానని గ్రహించాను. ఎవరికి చెప్పుకోవాలో తెలియులేదు. నాలో నేను చిత్రవధ అనుభవించాను. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. నాలో వస్తున్న మార్పులు కనిపెట్టి మనోహర్ నాచేత జరిగిందంతా చెప్పించు కున్నాడు. కోపంతో నన్ను చెంప దెబ్బ వేస్తాడేమో నని ఎదురు చూచాను. నయానో భయానో మందలిస్తాడేమోనని అనుకున్నాను. అదీ జరగలేదు. జరిగిందంతా విని ఒక్కమాట మాత్రం అన్నాడు. 'ఈ విషయం ఇంకెవరి చెవినా పడడానికి వీలు లేదని గుర్తుపెట్టుకో!' ఆ తరువాత రెండు మూడు రోజులకు నన్ను లేడీ డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళి నాకు అబార్షన్ చేయించాడు. నన్ను శ్రీమతి మనోహర్ అనే లేడీ డాక్టర్‌కు పరిచయం చేశాడు. ఆమెకు రెండు వందల రూపాయలు ఫీజు చెల్లించి నన్ను ఇంటి వద్ద దించి వెళ్ళాడు.



అలంకరణ
టి. శ్రీవాసులు

జరిగిందంతా నీతో ఎప్పటికీ చెప్పకూడదని నాచేత వాగ్దానం చేయించు కున్నాడు మనోహర్. నీ మనస్తత్వం బాగా అర్థం చేసుకున్న మనోహర్ ఇదంతా వింటే నీవు తట్టుకోలేవని అన్నాడు. నీతో చెప్పకుండా నిన్ను మోసం చేయలేకున్నాను. జరిగినదంతా నీతో చెప్పి, నిన్ను వివాహం చేసుకుని సుఖపడ లేనన్నాడు. జరిగిందంతా నువ్వు ఎప్పటికీ మరచి పోలేవన్నాడు. నిన్ను మోసం చేసి వివాహం చేసుకున్నా పరవాలేదని వాదించాడు. ఇందులో మోసం ఏమీ లేదని నన్ను నమ్మించడానికి ప్రయత్నించాడు. నీతో విషయం చెప్పి ఈ వివాహం చేసుకునే కన్నా నీకు దూరమై మరో వివాహం చేసుకో మన్నాడు.

చాలా కాలం ఆలోచించి అతను చెప్పిన నిర్ణయానికి వచ్చాను. నేను చేసుకున్న నిర్ణయం ఇంత వరకూ మనోహర్‌కు కూడా తెలియదు. కానీ మనోహర్ నాతో పెళ్ళికి ఒప్పుకుంటాడని మాత్రం నాకు గట్టిగా తెలుసు. కానీ, బావా! అతనిని వివాహం చేసుకుని అతనినీ మోసపెట్టలేనని ఇప్పుడే అర్థం అయింది. నీతో అనుభవించిన మధురమైన క్షణాలు ఒక విధంగా నా కళ్ళు తెరిపించాయి. నేను అసలు ఇంకెవరినీ పెళ్ళి చేసుకోకూడదు. నా కోసం బాధ పడకు, బావా నాకు చదువు ఉంది. పౌరుషం ఉంది! నా కాళ్ళమీద నేను నిలబడగలను— జరిగిందంతా మరచిపో, బావా! నువ్వు ఇంకెవరినైనా వివాహం చేసుకుని సుఖపడు. . . " చరిత్ర ఏమిటేమిటో వాగుతున్నది. కాలం గడచిపోతూ ఉంటే బండరాయిలా నిలబడి పోయాడు అజయ్.

చరిత్రను బాహువుల్లోకి తీసుకుని గాఢంగా కౌగిలించుకుని ఓదార్చాలనే భావనకు బదులు అతనికి ఆమెను దూరంగా తోసి ఎక్కడికైనా పారి పోవా లనిపించింది. ఆమెను తిరస్కరించి తిట్లు తిట్టి పాపం చేసుకోవాలని ఏదో జుగుప్స! గుండె చీల్చు కోవాలని, వెంట్రుకలు పీక్కోవా లనిపించింది! హృదయంలో కోటి అగ్ని పర్వతాలు బ్రద్దలై సెగలో దహించుకుపోయాడు. అతని చదువు, సంస్కారం అన్నీ...

"బావా!—" అంటూ చరిత్ర భుజం మీద చేయి వేసి వాళ్ళాడుతుంటే, అతనిని ముళ్ళ కంప ఏదో పట్టుకు పోయినట్లైంది.

మడి కట్టుకుని పవిత్రంగా మంత్రతంత్రాలతో చేసుకుంటున్న పూజకు మైలపడ్డ స్త్రీ వచ్చి అంటుకున్నట్లు అర్థం లేకుండా చీదరించు కున్నాడు.

తెగిన గాలి పటంలా గాలి ప్రవాహంలో గిలగిలా కొట్టుకు పోయాడు.

అంతలో మనోహర్ వచ్చాడు.

బావా మాటలు ఉరిక్కిపడ్డారు.

"మనోహర్!—" అంటూ గావుకేక పెట్టి మనోహర్‌ను కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు అజయ్.

"ఏ. . ఏం జరిగింది?" అంటూ మనోహర్ అనుమానంగా చరిత్ర కేసి చూచాడు.

"నువ్వు అన్నది నిజమైంది" అంటూ మంచం మీది నుండి దిగి గదిలోంచి బయటకు నడిచి వెళ్ళి పోయింది చరిత్ర. *